


# కథ

'ఏం చెప్పగలం చెప్పు!' ఒక విధమైన నైరాశ్యం ఆవహించింది అక్కడ.

'అంతా నాఖర్మ!' పెద్దగా రాగాలు తీస్తూ అంటోంది వసుంధర.

'నన్ను కూడ కలిపేసుకుంటే సరి!'

'మాటలకేం కొదవలేదు. అయినా దాని ముఖాన పెళ్ళిరాత ఉందో లేదో!'

'చెప్పాగా! టైము నెట్టుకొచ్చిందంటే ఏదీ ఆగదని!' పైకి భార్యని ప్రభావితం చెయ్యాలని ప్రయత్నిస్తున్నాడే గాని అనంతవర్మ అంతరంగం అతలాకులంగా ఉంది.

ఈ మధ్యకాలంలో సరిగా తిండికూడా ముట్టుకోబుద్ధి కావడం లేదు. మనిషి కూడా లేని ఆలోచనలతో కొంచెం తగ్గిపోయి ఉన్నాడు. కూతురు పెళ్ళి కోసం భార్యపడే ఆదుర్దాను తానుకూడ పంచుకుంటునే ఉన్నాడు.

'వనమాలికి ఆ పెళ్ళి ఘడియలు ఎప్పుడు వచ్చేనో!' ఒక్క క్షణం అలా కళ్ళు మూసుకొని వాలుకుర్చీలో వాలాడు.

'కళ్ళు మూసుకుంటే పగటి కలలు ఏమీ రావడం లేదు' నవ్వబోయాడు.

'కలలూ రావు... వచ్చినా అవి నిజమూకావు' ఒకింత నిష్ఠూరంగా అంది వసుంధర.

'మానవ ప్రయత్నాలు జరుగుతూనే ఉంటాయి. దాంట్లో కంగారు పడ్డానికి అవకాశం ఉండదు' అనునయిస్తూ అనబోయాడు.

'ఈ మాటలు నాలుగేళ్లనుండి వింటూనే ఉన్నాను. చూస్తే చూపులకని వచ్చిన ప్రతి సంబంధం వెనక్కి తిరిగిపోతోంది. అయినా వనమాలికి ఏం తక్కువని. చక్కని అందం ఉంది. చదువు సంస్కారం ఇక చెప్పనక్కరలేదు!'

'ఆ సోమశిలవారి సంబంధం తప్పక కుదురుతుంది. ఆ నమ్మకముందినాకు'

'ఏమోలెండి! చూసినవి డజనున్నర దాటాయి. ఒక్క సంబంధం కొలిక్కి రావడం లేదు.

'ప్రసాదరావుగారిని చూస్తుంటే అలా అన్పించడం లేదు. మన అమ్మాయి వాళ్ళకి తప్పక నచ్చుతుంది!

'మీ నమ్మకాలు మీకుంటాయి. కానీ వాటి వెనుక వాస్తవాలు...!'

'వాస్తవాలు కాదు... వల్లకాడూ కాదు! చెప్తున్నాను సోమశిల ప్రసాదరావు గారి సంబంధం సెట్ అవుతుంది. కుర్రాడు సివిల్ ఇంజనీరు. చక్కగా హైదరాబాద్‌లో ఉద్యోగం చేసుకుంటున్నాడు.

'వనమాలికి జోడీ చక్కగా సరిపోతుంది!'

భర్త మాటలు కొంత వరకు ఉపశమనాన్ని కలుగజేస్తున్నాయి: కానీ వాస్తవిక దృశ్యం... తల్చుకుంటే ఆవిడ మనసు కకావికలమవుతోంది.

పైకి మాట్లాడుతున్నాడే గాని కూతురు

# విడిదారి

పెళ్ళి సమస్య ఆయన్ని కుంగదీస్తూనే ఉంది.

అసలు తానేం పాపం చేశాడని. తనకు ఎందుకీ పరాభవం

అనంతవర్మ కనుకొలకుల్లో నీళ్ళు చిప్పిల్లినాయి.

'సురేఖ...' ఆ పేరు గుర్తుకొచ్చే సరికి కోపం కట్టలు తెంచుకొచ్చింది. మనసు అతలాకుతల మయిపోయింది. తమ సంతోషాలన్నింటినీ హరించుకొని వెళ్ళిపోయింది. తన రక్తం పంచుకు పుట్టిన కూతురు అంతగా తెగిస్తుందని ఏనాడు ఊహించలేదా దంపతులు.

ఇద్దరు కూతుళ్ళనీ అపురూపంగా పెంచిపెద్దజేశాడు ప్రేమను పంచాడు. గారంగా చూసుకున్నాడు. ఇక వసుంధర అయితే సరేసరి. అమ్మాయిలను నేల నడవ నిచ్చేదికాదు.

**వడలి రాధాకృష్ణ**

మంచి చదువులు చెప్పించాడు చక్కటి సంస్కారాన్ని ప్రోదిజేశాడు చెప్పాలంటే తన తాహతుకు మించి వారిని తీర్చిదిద్దాడు.

తను నేర్పిన క్రమశిక్షణ... సంస్కారం ఏమైపోయినట్లు!

డాడీ! మహేష్ నా క్లాస్‌మేట్! మంచివాడు. నాలుగు సంవత్సరాలుగా తెల్సతను. మహేష్‌ని ఇష్టపడుతున్నాను'.

'................'

'మీరు ఒప్పుకుంటే మనసిచ్చిన వాణ్ణి మనువాడాలని వెళ్ళిపోతున్నాను!' సురేఖ ఇంట్లోంచి పారిపోతూ వ్రాసిన ఉత్తరం తమ కుటుంబంలో ఆనాడు పెనుప్రకంపనల్ని సృష్టించింది'

కన్నకూతురు తన నమ్మకాన్ని ఒమ్ముచేసి పడేసింది. చెప్పకుండా వెళ్ళిపోయింది. చాలాచోట్ల వెదికాడు. అన్నిచోట్లా గాలించాడు. పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ ఇచ్చాడు.

'మన ఇంటావంటా లేవు ఇలాంటివి. ఇదేం దారుణమండీ!' వసుంధరను ఓదార్చడం ఆనాడు తనవల్ల కాలేదు. బంధువులంతా వెలివేసి పడేశారు. అదుపులో పెట్టుకోలేకపోయిన కూతురు కులంకాని వాడితో లేచిపోయిందని దెప్పిపొడిచారు.

పనికి మాలిన పెంపకమంటూ ముఖం మీదే కడిగేశారు. అంతకాలంగా సంఘంలో సంపాదించుకున్న పరువు మర్యాదలు కృష్ణలో కల్సిపోయినట్లనిపించింది.

కులంకాని వాడితో వెళ్ళిపోయి బయట

ఎక్కడో దండలు మార్చుకున్నారట.

పరిస్థితులు తమనుండి దూరంగా జరిగిపోయినా తర్వాత వర్మకానీ, వసుంధర కానీ, పెద్దకూతుర్ని పూర్తిగా ఒదిలేశారు. గుట్టుగా బ్రతుకుతున్న తమను బజారు కీడ్చినది 'ఇకలేదు' అన్న నిర్ణయానికి వచ్చేశారు.

'మిమ్మల్ని బాధ పెట్టాను. క్షమించండి. మహేష్ లేని బ్రతుకు వ్యర్థం నాకు' ఒకసారి ఇంటి కొచ్చిన కూతుర్ని చూసేసరికి ఆవేశం తన్నుకొచ్చింది. ఇంటి గడప తొక్కడానికి అవకాశం లేదంటూ బయటకు నెట్టేశాడు.

సురేఖ చేసిన రాద్ధాంతం మూలాన ఇప్పుడు వనమాలికి ఎన్ని సంబంధాలు చూస్తున్నా అన్నీ వెనక్కిపోతున్నాయి. ఆమె పెళ్లి ఇప్పుడు అనంత వర్మకు పెనుసవాలుగా మారిపోయింది.

తెల్సిన సంబంధాలన్నీ వాకబు చేస్తున్నాడు. అందరూ అమ్మాయి బాగానే ఉందంటున్నారు. కానీ అక్క చేసిన నిర్వాకాన్ని బూతద్దంలోంచి చూసి వెనక్కిపోతున్నారు.

వసుంధర కుమిలిపోతోంది. తల్లిని చూసిన వనమాలి తల్లడిల్లిపోతోంది.

'మమ్మీ! నాకిప్పుడు పెళ్ళికాకబోతే వచ్చిన నష్టం ఏమిటి చెప్పు! చదువుకున్నాను. ఉద్యోగం చేసుకోగలను. స్వశక్తితో బ్రతకగలను'.

'కలకాలం ఉండే ప్రాణాలు కావు ఇవి. ఓ అయ్యకు నిన్ను ఒప్పగించేస్తే' అమ్మ పూర్వకాలపు ధోరణులు వనమాలికి నవ్వును తెప్పిస్తుంటాయి.

మొన్నటి వరకు వర్మ విషయాల్ని కొంత వరకూ తేలిగ్గానే తీసుకున్నాడు కానీ ఎన్నిసంబంధాలు వచ్చినా అన్నీ వెనక్కిపోతున్నాయి.

క్రమంగా ఓ సాంప్రదాయ నేపథ్యంలో కొనసాగిన ఇంట్లో సృష్టింపబడిన ప్రకంపనాలు ఆయన్ని మానసికంగా అతలాకుతలం చేసి పడేస్తున్నాయి.

'సురేఖ ఇప్పుడు లెక్కలలో లేని మనిషి. అక్కరకు రానికూతురు. ఆ విషయమే వచ్చిన సంబంధాల వారితో నిజాయితీగా చెప్పేస్తున్నాడు.

కానీ ఆయన నిజాయితీని వారు వేరే విధంగా అన్వయించుకొని వెనక్కిపోతున్నారు.

ఇప్పుడు సోమశిల ప్రసాదరావుగారి సంబంధం బాగానే ఉన్నట్లు అన్పిస్తోంది తండ్రి సహృదయుడు. పిల్లను చూసుకొని నిర్ణయం తర్వాత తెలియజేస్తామని చెప్పి వెళ్లారు.

తాను మోస్తున్న భారం అంతా ఇప్పుడు తొలగిపోతుందన్న నమ్మకం ఏర్పడుతోంది ఆయనకు.

ఆ ఆశతోనే వారి కబురు కోసం ఎదురు చూస్తున్నారు.

× × ×

సహృదయ అనంతవర్మగారికి....

చాలా సంతోషంగా ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. పిల్లాపిల్లాడు జాతకాల్ని ఇక్కడ చూపించాను. అవిబాగానే కుదిరాయి. మా అబ్బాయి కూడ మీ వనమాలిని వివాహం చేసుకునేందుకు తన అంగీకారాన్ని తెలియజేశాడు.

అన్ని ఇప్పుడు శుభసూచికలే!

మొన్న పెళ్ళి చూపులప్పుడు మీరు ప్రదర్శించిన నిజాయితీ మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకొంది. మీ కుటుంబ స్థితిగతులు, ఆర్థిక పరిస్థితులు, అన్నీ విశదీకరించి చెప్పడం మాకు చాల ఆనందమనిపించింది.

వాటన్నింటికీ మించి మీ పెద్దమ్మాయి గురించి మీరు ఇచ్చిన వివరణ మమ్మల్ని ఆలోచింపజేసింది.

ఈ యాంత్రిక యుగంలో అది అంత సీరియస్‌గా తీసుకోవాల్సిన విషయం ఏమీ కాదన్నది నా భావన.

చదువుకున్న ఈ కాలపు పిల్లలు. మనకు తప్పుగా అన్పించవచ్చుగాని తమ జీవిత గమనాన్ని వాళ్ళకి వాళ్ళే నిర్దేశించుకున్నారనిపిస్తుంది.

పెద్దమనసుతో క్షమించి వాళ్లమానాన వాళ్ళని వదిలేసిన మిమ్మల్ని అభినందించి తీరాలి.

మీ పెద్దఅమ్మాయి నిర్ణయం మీ రెండో అమ్మాయి జీవితానికి ఏ విధంగానూ ప్రతిబంధకం కాదని నమ్ముతున్నాను. ఆ నమ్మకంతోనే మీ వనమాలిని మీ ఇంటి కోడలిగా చేసుకోవడానికి అంగీకారాన్ని తెలియజేస్తున్నాను.

ఇక్కడ మా స్వగతాన్ని తమరి ముందుంచవలసిన అవసరాన్ని గుర్తిస్తున్నాను.

ముప్పై సంవత్సరాల క్రిందటి మాట.

వైదేహి నా క్లాస్‌మేట్. ఆ రోజుల్లో మా మనసులు కలిశాయి. ఉద్దేశాలు ఒక్కటయ్యాయి. ఆమెలోని నిజాయితీ వైదేహికి నన్ను సన్నిహితం చేసింది. ఈ కులమతాల పట్టింపులు మాకు చాలా చిన్న విషయాలుగా అన్పించసాగాయి.

వేరే కులస్తురాలయిన ఆమెను నాజీవిత భాగస్వామిగా ఎన్నుకున్నాను. అయినా మా సంసారం చాలా ఆనందంగా సాగిపోతోంది.

మా కంటి వెలుగు సతీష్. వాణ్ణి చాలా ఉన్నతంగా తీర్చిదిద్దాము సతీష్ వనమాలిల దాంపత్యం ఉన్నతంగా కొనసాగగలదని భావిస్తున్నాను.

కావున త్వరలో పెళ్ళి ముహూర్తం నిర్ణయించి తెలియజేయగలరని అనుకొనుచున్నాను.

-సోమశిల ప్రసాదరావు

× × ×

వర్మలో తెలియని అంతర్మథనం

ప్రసాదరావుగారు వ్రాసిన ఉత్తరాన్ని పదేపదే చదువుకున్నాడు.

భార్యకు చూపించాడు.

మాటలు కరువైన మౌన భావన వారి అంతరంగాల్ని కట్టిపడేస్తోంది.

ఓ విధమైన నిశ్శబ్ద ప్రపంచం అక్కడ నెలకొని ఉంది. ప్రసాదరావుగారి ఆహ్వానం వారిని ఆలోచనల్లో పడేస్తోంది.

ఇంతకాలంగా తాము ఏ విషయం మీద తర్జన భర్జన పడి మానసిక సంఘర్షణను ఎదుర్కొన్నారో అదే విషయం మరో రూపంలో కూతురు పెళ్ళికి ప్రతిబంధకమయి కూర్చుంటోంది.

ఏ నిర్ణయం తీసుకోలేని అచేతన స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

కాళ్ళ దగ్గరకు వచ్చిన సంబంధాన్ని కాలదన్నడమా! లేక పరిస్థితులకు రాజీపడి ముందుకు సాగడమా!

చాలా రోజులు ఆలోచించాడు. చివరకు తన నిర్ణయం తెలియజేయడానికి సమాయత్తమయ్యాడు.

"సోమశిల వారికి.....

వర్మ వ్రాయునది, నమస్కారములు

ఉత్తరం అందింది. చదివించింది... ఆలోచింపజేసింది.

మీ సంస్కారానికి అభినందనలు

కానీ అమ్మాయికి అక్కడ రాసిపెట్టలేదన్న వాస్తవం నన్ను ప్రక్కదారిలోకి మళ్ళించింది.

క్షమించండి... మా బంధువుల కొడుకు అమెరికాలో ఉంటున్నాడు మొన్ననే ఇండియాకు వచ్చాడు.

తొలిచూపులోనే వనమాలి నచ్చేసిందట! వివాహం చేసుకోవడానికి ముందుకొచ్చాడు.

కాదనడానికి నాకు కారణం ఏమీ కన్పించలేదు. నిజంగా ఇది మీకు అసౌకర్యమే! దానికి చింతిస్తున్నాను"

**-అనంత వర్మ**

ఉత్తరాన్ని పదే పదే చదువుకున్నాడు పట్టుబట్టి మరీ ఆత్మ వంచన వ్రాయించిన ఉత్తరం అది.

తనకు తెలిసి జీవితంలో మొదటిసారిగా ఒక పెద్దమనిషి దగ్గర అబద్ధం చెబుతున్నాడు.

కారణం.... ఏదైనా కావచ్చు. ఒక మామూలు మనిషి స్థితికి దిగజారి ఆ చట్రంలో ఇరుక్కొని తీసుకున్న నిర్ణయం అది.

అసలు తన కూతురుకు పెళ్ళి చేయగల్గుతాడా!

ఏమో!!

ఎడ్రస్సు వ్రాసిన ఆ కవరు తనను అవహేళన చేస్తూంటే అలా కుర్చీలో వాలి కళ్ళుమూసుకున్నాడాయన.